www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 ఆగస్టు 2025
5
తిరుపతి



కుప్పంకు 'కృష్ణా' జలాలు

30న సిఎం దంపతుల జలహారతి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పం హంద్రీనీవా కాల్వల ద్వారా కృష్ణాజలాలు పలమనేరు నియోజకవర్గం వి.కోట వరకూ శనివారం చేరుకున్నాయి. ఈనెల 29న కుప్పం పర్యటనలో భాగంగా ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సతీమణి నారా భువనేశ్వరి బెంగుళూరు చేరుకుంటారు. అక్కడనుంచి కారులో రోడ్డుమార్గాన శాంతిపురంలోని సొంత నివాసంలో బస చేస్తారు. మరుసటిరోజు కరమసముద్రం వద్ద హంద్రీనీవా జలాలను విడుదల చేసి జలహారతి ఇస్తారు.అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగిస్తారు. హంద్రీనీవా కాల్వల ద్వారా కృష్ణాజలాలు వి.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మెట్టపల్లి వద్దకు రావడంతో ప్రజలు జలాలకు హారతులు ఇచ్చి ఆనందం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'నారా'వారి ప్రక్షాళన...

'నీరుగారిన' నివేదిక..?



'వైసిపి అవినీతి ప్రక్షాళన తిరుమల నుంచే ప్రారంభిస్తా..' అని చెప్పిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాటలు ఆరంభశూరత్వమేనా? అని కొండంతా చర్చే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'కల్తీ నెయ్యి వ్యవహారాన్ని' వెలుగులోకి తెచ్చి 'తెల్ల ఏనుగులను' వదిలేసి 'చీమలను' పట్టుకున్నారన్న విమర్శలు లేకపోలేదు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నెయ్యి సరఫరాదారులకు శిక్ష పడింది.. అయితే ఈ కల్తీ నెయ్యి వ్యవహారానికి టిటిడిలో అండగా నిలిచిన ఉన్నతాధికారుల మాటేంటి..? కావాలనే విజిలెన్స్ అండ్ ఎన్ఫ్‌ర్స్‌మెంట్ నివేదికను తొక్కి పెట్టారని తెలుస్తోంది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుమల

వైసిపి హయాంలో గత ఐదేళ్లలో టిటిడిలో నెలకొన్న అవినీతిపై సిఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఒక ఎస్పీ స్థాయి అధికారితో పాటు, మరికొంతమంది అధికారులను నియమించారు. గత ఐదేళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సిఎం సూచించారు. నివేదిక ఎనిమిది నెలల ముందే రాష్ట్ర ప్రభుత్వానికి, టిటిడి ఉన్నతాధికారులకు సమర్పించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా ప్రభుత్వం తరపున డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులతో పాటు, టిటిడిలో పనిచేస్తున్న దాదాపు 40-50 మందిపై అవినీతి మరకలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క కల్తీ నెయ్యి వ్యవహారమే కాదు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్టు, ఇంజినీరింగ్, ఎస్టేట్ విభాగాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగినట్లు చర్చ నడుస్తోంది. అయితే విజిలెన్స్ తేల్చిన నివేదికపై చర్యలకు ఎందుకు వెళ్లడం లేదన్నది సర్వత్రా చర్చ. నివేదికపై చర్యలకు వెళ్లాలా, వద్దా అనే విషయమై టిటిడి ఉన్నతాధికారుల్లోనే తర్జనభర్జన ఉండడంతో 'రాజకీయంగానే' నివేదికను తొక్కి పెట్టారన్న అనుమానాలకు తావిస్తోంది. 'కల్తీ నెయ్యి వ్యవహారం' సందర్భంగా ఊపిరి సలపకుండా రెండు నెలల పాటు కూటమి ప్రభుత్వం ఏదో జరిగిపోయినట్లు హడావిడి చేసి, చివరకు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా నివేదిక తయారయ్యింది.

కల్తీ నెయ్యి వ్యవహారంపై అప్పట్లో యుద్ధప్రాతిపదికన తొలుత 'సిట్'ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో సిబిఐని నియమించింది. విచారణ అనంతరం ఎఆర్ డెయిరీతో పాటు బొలేబాబా, వైష్ణవి డెయిరీ నిర్వాహకులు అంతా కేసులో ఉన్నారు. ఇందులో అధికారులు సైతం అవినీతికి పాల్పడినట్లు సిబిఐ నిర్ధారించింది. ఇందులో కొంతమంది అప్రూవల్‌గా మారినట్లు తెలుస్తోంది. అయితే అవినీతికి పాల్పడిన ఉద్యోగుల వివరాలను మాత్రం బహిర్గత పరచకుండా, చర్యలు తీసుకోకుండా గోప్యంగా ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోశాల డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ హరినాథ్‌రెడ్డి పాత్రపైనా నివేదిక ఇచ్చినా, అతను తొక్కిసలాట ఘటనలో సస్పెండ్ అయినా, ఇప్పటికీ వివరాలను బయట పెట్టలేని స్థితిలో టిటిడి ఉంది.

టిటిడి ఇంజినీరింగ్ విభాగం అత్యంత అవినీతిమయంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అనేక అక్రమ దందాలు నడిపినట్లు విజిలెన్స్ నివేదిక ఇచ్చిందట. స్విమ్స్ నిర్మాణాలు, పద్మావతి నూతన ఆస్పత్రి పనులతో పాటు, గోవిందరాజ సత్రాల కూల్చివేతపనులపైనా విచారణ జరిపింది. అక్రమ ప్రమోషన్లతో అర్హత లేని వారిని అందలమెక్కించినట్లు నిర్ధారించింది. మార్కెటింగ్‌లో టిటిడి రవాణా శాఖ వాహనాల కొనుగోళ్లతో పాటు అద్దె వాహనాల పేరుతోనూ అవినీతి జరిగిందని చర్చ నడుస్తోంది. మార్కెటింగ్ శాఖలో జీడిపప్పు, పప్పుదినుసుల కొనుగోళ్లలోనూ అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎస్టేట్ విభాగంలో హోటల్స్ టెండర్లతో పాటు షాపులు, తట్టల దందా పెద్దఎత్తున నడిచింది. దళారులను పెట్టుకుని వసూళ్ల కార్యక్రమాలు జరిగాయని విజిలెన్స్ సాక్ష్యాలతో సహా తేల్చిందని తెలుస్తోంది. 'వైసిపి' హయాంలో తిరుమలలో జరిగిన అవినీతిని తేలుస్తానని చెప్పిన సిఎం చంద్రబాబునాయుడు, నివేదికపై యాక్షన్ తీసుకోకపోగా, అవినీతి అధికారులనే ఇప్పటికీ కొనసాగిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అవినీతి అధికారులనే కొనసాగిస్తున్నారా? అవినీతినీ కొనసాగిస్తున్నారా? అన్నది 'శ్రీవారికే' ఎరుక.

'మఠం కూల్చివేత'పై అపోహాలు వద్దు

పడమర ఉత్తర భాగాలు దెబ్బతిన్నాయి
సమన్వయ సమావేశంలో తుది నిర్ణయం

వారసత్వ సంపదగా హాథీరాంజీ మఠం
మీడియాతో కలెక్టర్ వెంకటేశ్వర్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారికి పరమ భక్తుడిగా పేరొందిన శ్రీ స్వామి హాథీరాంజీ మఠంను బంజారా సామాజిక వర్గానికి వారసత్వ సంపదగా కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని, కాలానుగుణంగా 125 సంవత్సరాల చరిత్ర కలిగిన మఠం భవనం పడమర, ఉత్తర భాగాలు దెబ్బతిన్నాయని దీనిని కూల్చివేసి, యధాస్థితిగా నిర్మించడానికి రెండు మూడు రోజుల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరం కలిసి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర స్పష్టం చేశారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని గాంధీరోడ్డు మార్గంలో గల శ్రీ స్వామి హాథీరాంజీ మఠం మండువా భవనాన్ని శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ, తిరుపతి ఐఐటి నిపుణుల బందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మఠం భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని, ఎలాంటి అపోహలు పడవద్దన్నారు. బంజారా సంఘం నాయకులు వారసత్వ ఆస్తిగా మఠాన్ని ఉంచాలని కోరారని, మఠం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ప్రాణనష్టం జరగకుండా లీజు ప్రాతిపదికన దుకాణాలు పొందిన వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోడానికి సమన్వయ సమావేశాన్ని రెండు మూడు రోజుల్లో నిర్వహిస్తామన్నారు. తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక కట్టడాలను కాపాడడానికి చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా శ్రీ స్వామి హాథీరాంజీ మఠం మండువా భవనం పరిరక్షణకు, శిథిలావస్థకు చేరిన ప్రాంతాలను మరమ్మత్తులు చేయించడానికి జిల్లా కలెక్టర్ నేతత్వంలో అందరం కలిసి పనిచేస్తున్నామన్నారు. బంజారా సంఘాల నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యలు అగ్నిహోత్ర పూజలను నిర్వహించారు. విశ్వబంజారా సాదు సంతు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మఠం విశిష్టతను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో యాదవ అభివద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి, పర్యవేక్షణ అధికారి కేశవులు, మబ్బు దేవనారాయణరెడ్డి, వూకా విజయ్ కుమార్, ఆర్సి మునికష్ణ, కార్పొరేటర్ నరసింహచారి, అన్నా అనిత యాదవ్, నరేంద్ర, పొన్నాల చంద్ర, రేవతి, పుష్పావతి, శ్రీధర్ వర్మ, రాజారెడ్డి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ నేతకు పితృవియోగం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



యుటిఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి తండ్రి కేశవరెడ్డి శనివారం ఉదయం కార్వేటినగరం మండలం అమ్మపల్లి గ్రామంలో మృతి చెందారు. యుటిఎఫ్, సిఐటియు నేతలు నివాళులు అర్పించి, ముత్యాల రెడ్డిని పరామర్శించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జివి రమణ స్పందిస్తూ కేశవరెడ్డి ఆదర్శరైతుగా జీవితాన్ని కొనసాగించారని, పేద ప్రజలకు సాయం చేయడంతో పాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో మెళకువలు నేర్పేవారని అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతూ, ఆ ప్రాంతంలోని పేద ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్నారన్నారు. నివాళి అర్పించిన వారిలో ఉమ్మడి జిల్లాల నాయకులు మణికంఠ, రాజశేఖర్, దేవరాల నిర్మల, అవనిగడ్డ పద్మజ, గీతమ్మ, దీనావతి, విజయశ్రీ, కుమారస్వామి, మోహన్‌బాబు, బండి మధుసూధన్‌రెడ్డి ఉన్నారు.

సమాజానికి సేవ చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



విద్యార్థులు బాల్య దశ నుండే సేవా భావాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలని జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాల గురించి అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తిలో ఇప్పటి వరకు 32 మంది తతీయ సోపాన్, 12 మంది రాజ్యపురస్కార్ అవార్డులు పొందినట్లు రమేష్ బాబు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం 60 మంది విద్యార్థినీ విద్యార్థులు స్కౌట్స్ లో చేరేందుకు ముందుకు వచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, స్కౌట్స్ మాస్టర్లు ఎస్ కె. అజారుద్దీన్, కె. మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



'స్వచ్ఛాంధ్ర'లో అందరూ భాగస్వాములై 'స్వర్ణాంధ్ర'ను సాధించాలి అని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాబుజగ్జీవన్‌రామ్ పార్కులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. రామానాయుడు స్కూలు వరకూ ర్యాలీ నిర్వహించి తడిపొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తడిపొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి : కలెక్టర్

'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి రూరల్ తిరుచానూరు పంచాయతీ దామినేడులో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కంపోస్టు ఎరువును ప్రజలకు పంపిణీ చేశారు. ఎంపిడిఒ రామచంద్ర, జిల్లా పర్యటక శాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ మండలం చెన్నయ్యగుంట గ్రామదాఖలా సర్వే నంబర్ 194/6లోని శేషాచలం హిల్‌వ్యూ తుడా లేఔట్ ఫేస్-2లోని 57 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించి లబ్ధిదారులకు ఊరట కలిగించిన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ప్లాట్ల ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.మోహన్‌రావు, సెక్రటరీ ఒవి రామ్‌శర్మ, సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ల తమ బాధకు విముక్తి కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

నేడు ఎపిపిఎస్‌సి డిపార్టుమెంట్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 24న ఆదివారం జిల్లాలో జరగనున్న ఎపిపిఎస్‌సి - కంప్యూటర్ డిపార్టుమెంటల్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామసర్వేయర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, మధ్యాహ్నం 3-6 గంటల మధ్య మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరగనుందని తెలిపారు. 1450 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, డిప్యూటీ తహశీల్దార్ లైజాన్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎపిపిఎస్‌సి నుంచి టిఎస్ రాజ్‌గోపాల్, అసిస్టెంట్ సెక్రటరీ ఎం.జగదీష్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఎ.యోగేష్ పాల్గొన్నారు.

'సురవరం' మృతికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారత కమ్యూనిస్టు పార్టీ అఖిలభారత మాజీ కార్యదర్శి, కమ్యూనిస్టు కురువద్ధుడు సురవరం సుధాకర్ రెడ్డి మరణానికి సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ విస్తత సమావేశం సంతాపం తెలిపింది. కమ్యూనిస్టు ఉద్యమానికి ఎనలేని సేవలు చేసిన ఆయన మరణం కమ్యూనిస్టు శ్రేణులకు తీవ్ర నష్టమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. కమ్యూనిస్టు ఐక్యత కోసం ఆయన ఎనలేని కషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, సాయి లక్ష్మి, వేణు, మాధవకష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు జేవివి అభినందనలు

ప్రజాశక్తి - రేణిగుంట



ఫిజికల్ సైన్స్ ఫోరమ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు 'విశ్వం పుట్టుక -భారతదేశ అంతరిక్ష పురోగతి'పై ప్రతిభా పరీక్షలు నిర్వహించి విజేతలకు మెమోంటోలు ప్రసంశా పత్రాలు బహుకరించారు. రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరమ్ సభ్యులు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు మోహన్ నాయుడు మాట్లాడుతూ భారత దేశం అంతరిక్ష రంగంలో ప్రపంచంలో నాలుగో స్థానానికి ఎదగడం గర్వకారణమన్నారు. విద్యార్థులు విజ్ఞానతృష్ణ పెంచుకోవాలన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఒ.వెంకటరమణ, బాలికల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప పాల్గొన్నారు.

110 టిడ్కో ఇళ్లు రద్దు : కమిషనర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నేరుగా గానీ, బ్యాంకుల ద్వారా గాని రుణాలు చెల్లించడానికి ముందుకు రాని లబ్ధిదారుల టిడ్కో ఇళ్లను రద్దు పరుస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిడ్కో పరిధిలో 4064 గహాలను నిర్మించామనీ, వీరిలో 175 మంది బ్యాంకుల ద్వారా రుణాలు చెల్లించడానికి ముందుకు రాకపోవడంతో నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో 65 మంది లబ్ధిదారులు నేరుగా రుణాలు చెల్లించేందుకు ఒప్పుకోగా 110 మంది లబ్ధిదారుల నుంచి ఎలాంటి స్పందనలేదని చెప్పారు. వీరి స్థానంలో అర్హులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. రద్దు కాబోతున్న లబ్ధిదారుల పేర్లు, ప్లాట్ల నంబర్లను మున్సిపల్ కార్యాలయం తో పాటు అన్ని సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ఉంచుతున్నామనీ, అభ్యంతరాలున్న లబ్ధిదారులు సెప్టెంబర్ 5వ తేదీ లోపల లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

'అవిటి' బతుకుపై కూటమి 'దెబ్బ'

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పారదర్శకత పరిహాసమాడుతోంది.. రాజకీయం రాజ్యమేలుతోంది.. ఓ ప్రభుత్వంలో వికలాంగులకు పెన్షన్ అర్హత పొందుతుంటే, ప్రభుత్వం మారినప్పుడల్లా వారి జీవితాలకు 'భరోసా' లేకుండా పోతోంది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సదరం సర్టిఫికెట్లలో పర్సంటేజి ఆధారంగా పింఛన్ అందజేశారు. తీరా ఏడాది తరువాత అంగవైకల్య పర్సంటేజి తగ్గిపోయిందంటూ సర్వే నిర్వహించి నోటీసుల పేరుతో చావుదెబ్బ కొట్టారు. 'వికలాంగ పింఛన్లకు మీరు అనర్హులు.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇవ్వరు' అని చెప్పడంతో వికలాంగులు ఉన్న కుటుంబాల్లో అల్లకల్లోలం నెలకొంది. పరిస్థితి ఎలా ఉందంటే శాశ్వత అంగవైకల్యం ఉన్నవారు సైతం ప్రస్తుతం నోటీసులు అందుకోవడం విమర్శలకు తావిస్తోంది.

వికలాంగుల బతుకుల్లో వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం వారిని మరింత కష్టాల్లోకి నెట్టింది. సాయంలేక నడవలేని అభాగ్యులు, సచ్చుబడిన కాళ్లతో తడబడుతూ వచ్చే దివ్యాగులకు ఊతమివ్వకపోగా రీవెరిఫికేషన్ పేరుతో నోటికాడికి వచ్చే పింఛన్‌ను లాగేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా వస్తున్న పింఛన్ ఉన్న ఫలంగా తీసేస్తే దాని మీదే ఆధారపడిన బతుకులు తలకిందులవుతున్నాయి. పేరుకు పింఛన్ పెంచి.. మరో వైపు రీవెరిఫికేషన్ పేరుతో తొలగిస్తుండడంపై దివ్యాంగులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. వాస్తవానికి తమకు తాముగా బతికేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే వికలాంగుల పట్ల సమాజంలో కొంత వివక్ష ఉంది. జాలి ఉంది. ఆ వివక్ష నుంచి ఎవరికి వారే ఆత్మస్థైర్యాన్ని నింపుకుని, ఇతరులతో కలిసి జీవన పయణాన్ని సాగించేందుకు ప్రభుత్వాలు కొంత ఆర్థిక బలాన్ని ఇచ్చేందుకు వికలాంగ పెన్షన్‌ను ఇస్తున్నారు. 2024లో రాష్ట్రంలో అధిక మెజార్టీతో శాసనసభలో ప్రతిపక్షం అనేది లేకుండా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వికలాంగులకు, డయాలసిస్ రోగులకు, వృద్ధాప్య ఫించన్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో రూ.3000 ఉన్న వృద్ధాప్య పెన్షన్ 4 వేలుకు, 6 వేలు ఉన్న డయాలసిస్ రోగులకు రూ.10వేలు, వికలాంగులకు కనీస పెన్షన్ 4వేల రూపాయల నుంచి పర్సంటేజీ ప్రకారం పెంచి పెన్షన్ ఇచ్చేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులకు కనీస పెన్షన్ 6వేల రూపాయలుకు పెంచుతూ నిర్ణయం తీసుకుని, ఆ మేరకు అమలు చేస్తోంది. దీంతో పెన్షన్ పేరుతో ప్రభుత్వ భరోసా అందుకుంటున్న పెన్షదారులు సంతోషించారు. ఏడాది పాటు పెంచిన పెన్షన్‌ను పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం అటు తర్వాత తమ నిజస్వరూపాన్ని బయటపెట్టింది. పెన్షన్ అందుకుంటున్న వికలాంగుల్లో అధిక భాగంగా అనర్హులు ఉన్నారని, వైద్యులకు, అధికారులకు మామూళ్లు ఇచ్చి, వైకల్య పర్సంటేజీని ఉన్నదాని కంటే అధికంగా రాయించుకుని, అనర్హులు సైతం పెన్షన్ తీసుకుంటున్నారని 'అధికారులపై అపవాదు' వేస్తూ పెన్షన్ ఏరివేతకు పూనుకుంది. లక్షల సంఖ్యలో పెన్షన్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో వికలాంగులకు ఒకసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. తిరుపతి జిల్లాలో సుమారు 85 వేల నుంచి 90వేలకు పైగా వికలాంగులు ప్రభుత్వ పెన్షన్ అందుకుంటున్నారు. వీరందరూ గతంలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రకాల పరీక్షల్లో తమ వైకల్యాన్ని నిర్ధారించుకున్నాకే పెన్షన్‌కు అర్హులయ్యారు. వీరిలో సుమారు 28వేల నుంచి 30 వేల మంది వికలాంగులు అనర్హులని అధికారులు నిర్ధారించి, పెన్షన్ తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వాస్తవానికి దాదాపు 15, 20 సంవత్సరాల క్రితం అంగవైకల్యం నిర్ధారణ మాన్యువల్‌గా ఉండేది. అప్పట్లో వైద్యులు, అధికారులు, సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి వైకల్యాన్ని తోచిన రీతిగా పర్సంటేజీ ఇచ్చేవారని భావించి, వికలాంగుల సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా నిర్ధారించే, కంప్యూటర్ ద్వారానే ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక అక్రమాలకు అస్కారం లేదని ప్రభుత్వమే చెప్పింది. ఇప్పుడు అందులోనూ అక్రమాలు జరిగాయంటూ తొలగింపు ప్రారంభించడం విడ్డూరం. గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు సైతం పెన్షన్ ఇచ్చారని, అందుకే వాటిని తొలగిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. రీ వెరిఫికేషన్ పేరుతో నోటీసులు ఇచ్చి ప్రభుత్వం తమ బాధ్యత నుంచి తప్పించుకునే చర్యలకు పూనుకుంది. వాస్తవానికి 1988 78శాతం నిర్ధారించుకుని అప్పట్లో రూ.25 పెన్షన్ నుంచి ప్రస్తుతం 15వేల రూపాయల వరకు తీసుకున్న వృద్ధుడైన వికలాంగుడికి, తన వైకల్యం 51 శాతమే ఉందని, రూ.6వేల మాత్రమే ఇస్తామని అధికారులు నోటీసులు ఇచ్చారు. 2011లో 57శాతం ఉన్న మహిళాను ఇప్పుడు అనర్హురాలిగా 2010 నుంచి పెన్షన్ తీసుకుంటున్నా ప్రకటించారు. పోలియో బాధితున్ని సైతం పెన్షన్‌కు అనర్హుడిగా ప్రకటించడం బాధాకరం. దీన్నిపై వికలాంగులు రోడ్డెక్కారు. ప్రభుత్వం రాజకీయల పేరుతో తమపై వివక్షత చూపడం సరైనది కాదని నినదించారు. వీరికి వామపక్షాలు అండగా నిలబడ్డాయి. జిల్లా కలెక్టర్‌కు తమ గోడును విన్నవించేందుకు కలెక్టరేట్‌కు చేరుకున్న వికలాంగులను కనీసం అక్కడ సెక్యూరిటీ లోనికి కూడా అనుమతించలేదు. దీంతో వికలాంగులు మరింత ఆవేదనకు గురయ్యారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన గేట్ వద్ద తమ ట్రైసైకిళ్లను అడ్డుగా పెట్టి, ఎర్రని ఎండలో, గంటల తరబడి నడిరోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. కనీసం అధికారులు వారిపై మానవత్వం కూడా చూపలేదు. సాయంత్రం వరకు నిరసనలు సాగడంతో విధిలేని పరిస్థితుల్లో పెన్షన్ల తొలగింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పరిస్థితి చేయిదాటుతుందని భావించిన సిఎం వికలాంగుల పెన్షన్లు తొలగించలేదంటూ ప్రకటనలు చేశారు. రెండు రోజులు తర్వాత జిల్లా కలెక్టర్ స్పందించి, ఇప్పటి వరకు జిల్లాలో నోటీసులు అందుకున్న వికలాంగులు వారి వైకల్యాన్ని మరోసారి నిరూపించుకునే అవకాశం ఇస్తున్నామని, రీ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. ముందే వికలాంగులు కలెక్టర్ ప్రకటనతో ఇప్పుడు మరో సారి రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రుల్లో వైద్యులు, కార్యాలయాల్లో అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయక తప్పడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి, అర్హులైన వికలాంగులకు రకరకాల సాకులు చూపి పెన్షన్ తొలగింపును మానుకోవాలని వికలాంగులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.



గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో ఓ వికలాంగురాలిని మోసుకొస్తున్న దృశ్యం



సిపిఎం విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

వికలాంగ పింఛన్లు పునరుద్ధరించాలి : సిపిఎం

తిరుపతి జిల్లాలో రద్దుచేసిన వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. లేనిచో బాధితులతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యశోదాననగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.జనార్దన్ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. గతంలో డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే వికలాంగులకు పింఛన్లు మంజూరు చేశారని, ప్రస్తుతం వైకల్య శాతం ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. దాదాపు 30వేల మంది పింఛన్లను తొలగించడం బాధాకరమన్నారు. ఈనెల 25న కలెక్టర్ కార్యాలయం వద్ద జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలోచేపట్టే ఆందోళనకు సిపిఎం మద్దతు ఇస్తుందని తెలిపారు. వారి కుటుంబాలను వీధులపాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో ఇళ్లస్థలాలు, పట్టాలు, జగనన్న ఇళ్లు, శెట్టిపల్లి స్థలాలు, స్కూలు విలీనం సమస్యలపై పోరాడతామన్నారు.

వికలాంగురాలినని వదిలేశారు : ఈశ్వరి, తిరుపతి జబ్బార్‌లేఔట్



నాకు చిన్నతనంలోనే పెరాలసిస్ వచ్చింది. ఎడమచేయి, ఎడమకాలు, ఎడమవైపు మొత్తం శరీరభాగం పనిచేయదు. పెళ్లిచేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. అవిటిదాన్నని తెలిసినా పెళ్లిచేసుకుని, ప్రస్తుతం వదిలేశారు. ఒంటరిగానే 12ఏళ్ల బిడ్డ అండతో నెలకు రూ.1550 అద్దె చెల్లించుకుంటూ వచ్చే పింఛన్‌తో బతుకుతున్నాను. పింఛన్ల వెరిఫికేషన్ అంటూ ప్రభుత్వం ఏవిధంగా సర్వే చేసిందో తెలియదు. శరీరభాగాలు పనిచేయని నన్ను అనర్హురాలని తేల్చింది. సెప్టెంబర్‌నుంచి వికలాంగుల పింఛన్ ఇచ్చేది లేదని నోటీసు ఇచ్చి వెళ్లారు.ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఎలా బతకాలో అర్ధం కావడం లేదు. పెన్షన్ ఆడిపోతే నా పరిస్థితి అధోగతే.

రోడ్డు మూయొద్దని వినతి



ప్రజాశక్తి - పుత్తూరు :తిరుపతి జిల్లా, పుత్తూరు మండలం, తడుకు పంచాయతీ, ఎగువగూళూరు దళితవాడకు శిరుగురాజు పాలెం నుండి తడుకు వరకు లింకు రోడ్డు ఉంది. అయితే సిరుగురాజు పాలెం, రైల్వే బ్రిడ్జి మరమత్తులు జరుగుతుండటంతో, ఎగువ గూళూరు దళితవాడ, దిగువ గూళూరు గ్రామస్తులు తడుకు రూట్లో రాక పోకలు సాగిస్తున్నారు. తడుకు గ్రామస్తులు చవితి సందర్భంగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆ రోడ్డును మూసేశారు. ఈ విషయమై దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ, తడుకు రూట్లో రాకపోకలు ఆపితే మహిళలు, వృద్ధులు, గర్భిణిలు, విద్యార్థులు, వికలాంగులు, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది కలుగుతుందని, గ్రామస్తుల ప్రజల ఇబ్బంది దృష్ట్యా ఆ రోడ్డు తెరవాలని కోరారు. ఈ విషయమై తడుకు విఆర్ఓ జయపాల్ కు, తడుకు సెక్రటరీ అనిల్ కుమార్ కు, పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహశీల్దారు తడుకు సర్పంచ్ పి.వెంకటేష్ తో, గ్రామస్తులతో మాట్లాడి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టి.విజయ్ కుమార్, టి.లోకనాథం, వి.మురళీ, వై.హరి, టి.పెరుమాళ్, టి.మోహన్ బాబు, టి.నీలకంఠం, యస్.బాబు, టి.కిషోర్, బాలగుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహా సభలు జరుగుతాయని, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని జె.వి.వి గూడూరు అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సభలకు మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, రామమోహన్, సుబ్బారావు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీరు పొదుపుగా వాడండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కండలేరు డ్యామ్ వద్ద, రా-వాటర్ పంపింగ్ స్టేషన్ కు కీలకమైన విద్యుత్ సరఫరా చేయు విద్యుత్ ఉపకేంద్రం మరమత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జనరేటర్ ఉపయోగించి ఒక మోటారు సహాయంతో నీటి పంపింగ్ జరుగుతోంది. దీంతో గూడూరు మున్సిపాలిటీలోని వాటర్ ట్యాంక్ లు పూర్తిగా నిండలేదని, నీటిని పొదుపుగా వాడాలని పట్టణ ప్రజలకు గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నీటి సరఫరా తక్కువ మోతాదులో జరుగుతుందని తెలిపారు.

రిజర్వేషన్లు పరిరక్షించాలని ర్యాలీ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:సామాజిక న్యాయం సాధనలో రిజర్వేషన్లు కీలకమని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ చెరిపేయరాదని డిమాండ్ చేస్తూ సూళ్లూరుపేటలో శనివారం మాల మహానాడు రాష్ట్ర సంఘ నాయకులు ఆధ్వర్యంలో, బజారు వీధులలో హోలీ క్రాస్ నుండి, ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, అంబేద్కర్ వారసులు, ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

శ్రీజయతీర్థుల జీవితం, కృతులపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ :తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ద్వైతవేదాంత విభాగ రజతమహోత్సవం సందర్భంగా సంస్కృత విశ్వవిద్యాలయం ద్వైతవేదాంత విభాగం, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన ఆదర్శ సంశోధన సంస్థ పూర్ణప్రజ్ఞ సంశోధన మందిరం, బెంగళూరు ఈ రెండు సంస్థల సహకారంతో "శ్రీజయతీర్థుల జీవితం మరియు కృతులు" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బెంగళూరులోని పూర్ణప్రజ్ఞ సంశోధన మందిరంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉడుపి పేజావర మఠాధీశులు, పరమపూజ్య శ్రీ శ్రీ విశ్వప్రసన్నతీర్థుల అధ్యక్షత వహించి అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. అనేక ద్వైతవేదాంత గ్రంథాలను లోకార్పణ చేశారు.

రైతుసంఘం మండల కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడులో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య ఆధ్వర్యంలో నూతన రైతు సంఘం మండల కమిటీని శనివారం ఏర్పాటు చేయడం జరిగింది. మండల అధ్యక్షుడిగా మానపల్లి నాగరాజు రాయల్, కార్యదర్శులుగా రంగయ్య, ఉపాధ్యక్షులు పోతురాజు సుబ్రహ్మణ్యం, మండల సహాయ కార్యదర్శులు వెంకటాద్రి, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు మంగయ్య, బ్రిజరాజ్ వెంకటరామయ్య, నవీనయ్య, సహాయ బ్రిజరాజ్ బాల గురవయ్య, సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు.

13న జాతీయ లోకాదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సెప్టెంబర్ 13 న జరగబోవు జాతీయ లోకాదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జానకి కోరారు. శనివారం పుత్తూరు కోర్టు ఆవరణలో పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీకి లోబడిన క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పుత్తూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, పుత్తూరు సిఐ కేశ్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిపాలనా భవనం ముందున్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి ఎస్వీయు ఇంచార్జ్ వీసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి(1953) మొదటి ముఖ్యమంత్రిగా పనిచేస్తూ ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య పద్మావతి, ఆచార్య శ్రీనివాసులు నాన్ టీచింగ్ అసోసియేషన్, ఇంజనీర్ తాండవకృష్ణ, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమిపై కన్నేసి.. ప్లాట్లుగా మార్చేసి





బాధితురాలు వెంకట లక్ష్మి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): ఏ పార్టీ అధికారంలో ఉంటే మాకేంటి..! ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తామంటున్నారు కొందరు వైసీపీ నేతలు. ఈ క్రమంలోనే మండలంలోని చేమూరులో ఓ ఒంటరి దళిత మహిళ భూమిపై చోడవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత కన్నేసి ప్లాట్లుగా మార్చే ప్రయత్నం చేసిన ఘటన వెలుగు చూసింది. ఆ నేత పన్నాగంపై బాధిత మహిళ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. బాధితురాలి కథనం మేరకు.. చేమూరు దళితవాడకు చెందిన మాదమాల వెంకటలక్ష్మికి 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడో విడత భూ పంపిణీ కింద చేమూరు రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 308-డి లో 1.68 ఎకరాల భూమిని పంపిణీ చేసింది. అయితే చోడవరం గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత ఆ భూమిని ఆక్రమించేందుకు గత కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నాడు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని వెంకటలక్ష్మి పై దౌర్జన్యానికి దిగగా రెవెన్యూ అధికారులు పంచాయతీ చేసి సర్ది పెట్టారు. మూడు రోజుల కిందట సదరు వైసీపీ నేత మరో మారు జెసిబి పెట్టి వెంకటలక్ష్మి భూమిని చదును చేసి ప్లాట్లు వేసే ప్రయత్నం చేశాడు. దీంతో వెంకటలక్ష్మి అడ్డుకోగా దౌర్జన్యానికి దిగాడు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వెంకటలక్ష్మి వాపోయింది. ఒంటరి మహిళగా ఆ నేతను ఎదుర్కొనే శక్తి లేదనీ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తనకు న్యాయం చేయాలంటూ ప్రాధేయపడుతోంది.

ఒంటరి మహిళ భూమి జోలికొస్తే ఊరుకోం.. పెనగడం గురవయ్య, సిపియం నాయకులు



ఈ విషయమై సిపియం నాయకులు పెనగండం గురవయ్య మాట్లాడుతూ మాదమాల వెంకట లక్ష్మికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని కొంతమంది వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఒంటరి మహిళకు న్యాయం చేయాలని కోరారు.

కాలేజీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ



కాలేజీకి బయటనుంచి తాగు నీరు మోసుకెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య విద్యార్థులను తీవ్రంగా వేధిస్తుందని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు జి.తేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో ఉన్న వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతులకు గుయిందని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో విద్యార్థులు తాగునీటి క్యాన్లు బయటనుంచి మోసుకొని కాలేజీకి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరి కొందరు విద్యార్థులు బోర్ నీళ్లు తాగుతున్నారని తెలిపారు. తల్లికి వందనం కింద మంజూరైన 15,000 రూపాయలలో, 2,000 రూపాయలు కాలేజీ అభివృద్ధి కోసం తీసుకోవడం జరిగిందని, ఈ కాలేజీలో అభివృద్ధి ఏ మాత్రం కనిపించక పోవడం దారుణమన్నారు. ఈ సమస్య అధికారులకు కనబడటం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు బయటకు రాకూడదనే ఉద్దేశంతో, విద్యార్థి సంఘాలను కాలేజీకి రానీయకుండా, చీకటి జీవోలను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాలేజీ యాజమాన్యం స్పందించి కొత్త వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని, ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ముందు నిరసనలకు పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కూడా ముట్టడి కార్యక్రమం ఉంటుందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఫీజు బకాయిలతో అవస్థలు పడుతున్న విద్యార్థులు భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. శనివారం ఎస్వీ యూనివర్సిటీ ప్రకాశం భవన్ ముందు విద్యా రంగ సమస్యలపై పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు అక్బర్, రవిలు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు చదువు సజావుగ కొనసాగేలా చూడాలన్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, నిధులు పెంచి, మెస్స్ చార్జీలు 3000 రూపాయలు ఇవ్వాలని కోరారు. సత్యవేడు ఎస్సి నియోజకవర్గంలో ఎస్సి హాస్టల్ స్లాబ్ పడిపోయి శిధిలావస్థలో ఉందని, కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గు చేటని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనీ, అర్హులకు తల్లికి వందనం ఇవ్వాలని, 77 జీఓ ను రద్దు చేసి పీజీ చేస్తున్న అందరికీ ఫీజు రియాంబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, నగర కార్యదర్శి తేజ, వర్సిటీ నాయకులు నరసన్న, మధు, వేణు గోపాల్, సతీష, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ డీజీపీకి మానవ హక్కుల సంఘం నోటీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలపై ఏపీ డీజీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) నోటీసులు జారీ చేసింది. ఎస్వీయూ క్యాంపస్‌లో జరిగిన హింసపై ఆరు వారాల్లో నివేదిక సమర్పించాలని డీజీపీని ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా రౌడీ మూకలు తమపై దాడి చేశారని, నిందితుల పేర్లతో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేశారని తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. దాడి సమయంలో టీవీ ఛానళ్లలో ప్రసారమైన వీడియోలను గురుమూర్తి ఎన్‌హెచ్ఆర్సీకి సమర్పించారు. గతంలో వైసీపీ నేతలపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని డీజీపీ నివేదికను ఎన్‌హెచ్ఆర్సీకి అందించారు. ఈ నేపథ్యంలో మరోసారి తాజా దర్యాప్తు నివేదికను సమర్పించాలని ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశించింది.

ప్రకాశం పంతులుకు ఎస్పీ నివాళి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని, ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ క్యాంప్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమర యోధుడని, కార్యదక్షుడని తెలిపారు. ఆయన బాట యువతకు, ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఆర్ఐలు రాజశేఖర్, రమణ రెడ్డి, ఆర్ఎస్ఐలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విభజించి పాలించడమే మోడీ, బాబుల వ్యూహం



ప్రజాశక్తి-నాయుడుపేట:అణగారిన కులాలను అణగదొక్కేందుకు విభజన చట్టాన్ని తీసుకొచ్చి వారి అరాచకాలను ప్రశ్నించకుండా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు దళితులను విడదీసి పాలన చేస్తున్నారని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ ఆరోపించారు. శనివారం నాయుడుపేట, గాంధీ పార్కు వద్ద దళిత నాయకులు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దళితులు ఇప్పటికీ అనగదొక్క బడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల మధ్య చిచ్చుపెట్టి, వారి మధ్య సఖ్యత లేకుండా చేయడమే మోడీ, బాబుల వ్యూహం అన్నారు. దళితులందరూ కలిసికట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 30 రోజులు జైల్లో ఉంటే వారు ప్రజా ప్రతినిధులుగా అనర్హులంటూ తీసుకొచ్చిన బిల్లుతో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):మంగళం పరిధి, చెన్నాయిగుంట గ్రామ లెక్క ధాఖల సర్వేనెంబర్ 194/6ఏ లో శేషాచలం హిల్ వ్యూ తుడా లేఅవుట్ ఫేస్ 2 లో గల 57 ఫ్లాట్‌లను నిషేధిత జాబితా నుండి తొలగించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను శనివారం కలెక్టరేట్లో ఆ ఫ్లాట్ల ఓనర్లు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్లుగా ఈ ఫ్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బందులు పడ్డామని, నిషేధిత జాబితా నుండి తొలగించడంతో తమకు ఎంతో సంతోషం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ రావు, కార్యదర్శి రమణ శర్మ, సభ్యులు రాజేంద్రప్రసాద్, లక్ష్మి, కార్తీక్, రమణ, ప్రభాకర్ రెడ్డి, జ్యోతి కృష్ణ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు ఆపండి : మాజీ డిప్యూటీ సీఎం




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ హాయంలో మద్యం అమ్మకాలను నియంత్రించాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే నిర్వహించిందని, అయితే నేడు లిక్కర్ స్కాం పేరుతో తనను ఇబ్బంది పెట్టాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం చేసుకుని సిట్ అధికారులు మా ఇంటికి వచ్చి వెళ్లిన తరువాత ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయించడం బాధాకరమని మాజీ డిప్యూటీ సీఎం కలత్తూరు నారాయణస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో కుమార్తె కృపాలక్ష్మితో కలసి ఆయన మాట్లాడారు. సాధారణంగా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహిస్తే స్కాములు జరుగుతాయా, ప్రైవేటుపరం చేస్తే స్కాములు జరగతాయా అన్న చిన్న విషయ పరిజ్ఞానం కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడు తప్పులకు తావు ఇవ్వలేదని, నేడు రాష్ట్రంలో ఉదయం పాల ప్యాకెట్లు దొరికే సమయానికి కూడా మద్యం దొరుకుతుందంటే మద్యం అమ్మకాలు ఏ విధంగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సిట్ అధికారులు వచ్చి వెళ్లిన తరువాత ఎల్లో మీడియా దినపత్రికలలో చూస్తే తన ఇంట్లో 8 కోట్ల రూపాయలు దొరికిందని, రికార్డులు స్వాధీనం చేసుకున్నారని, లాప్టాప్ కూడా సెట్ అధికారులు తీసుకెళ్లినట్లుగా వార్తలు ప్రచురించారన్నారు. సిట్ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు తాను సమాధానం చెప్పారని, కానీ జరగనిది జరిగినట్లుగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నం దారుణం అన్నారు. నియోజకవర్గ పరిశీలకులని అధిష్టానం నియమిస్తోందని తప్పుడు ప్రచారాలు చేయడంమానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఇన్చార్జి మంత్రిపై నిరాధార ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ గత వైసిపి హాయంలో తిరుపతిలో జరిగిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తుండడంతో దీనిని జీర్ణించుకోలేక మాజీ శాసనసభ్యులు భూమన, ఆయన తనయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ నిరాధార ఆరోపణలను చేయడం తగదని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు, ఎస్సీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు శ్రీపతిబాబు పేర్కొన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయాక ఏమి చేయాలో తెలియక దళితుడైన పవన్ అనే యువకుడ్ని చిత్రహింసలు చేయడం నగరవాసులందరూ చూశారన్నారు. తిరుపతిలో గంజాయిని పరిచయం చేసిన భూమన కుటుంబం చేసిన అక్రమాలను బయట పెడుతుంటే ఇలాంటి నీచ సంస్కృతికి దిగుతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సుబ్బయ్య, నాగరాజు, రేవతి, మురళి పాల్గొన్నారు.

పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డికి సన్మానం



ప్రజాశక్తి -కోట : వాకాడు ఏఎంసి మాజీ చైర్మన్, టిడిపి నాయకుడు పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డికి ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వాకాడు డిపో గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మీజూరు చిన్న చెంగయ్య, రాయపు పోలయ్య, ఇన్నమాల సురేష్, పాల ఉమామహేశ్వర రావు, మీజూరు చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ టివి వైర్లు ప్రమాద భరితంగా ఉన్నాయి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేబుల్ ఆపరేటర్లు పట్టణాల్లో, గ్రామాల్లో విద్యుత్ పోలుకు కిందనే వేలాడేటట్టుగా వారి కేబుల్ వైర్లు కట్టి ఉన్నారు. వాటివల్ల ప్రమాదాలు జరిగితే విద్యుత్ శాఖ బాధ్యత వహించదని తిరుపతి జిల్లా విద్యుత్ శాఖ అధికారి సురేంద్ర నాయుడు తెలిపారు. శనివారం పుత్తూరు డిఈ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లు వారి వైర్లు విద్యుత్ స్తంభాల నుండి తొలగించాలని తెలిపారు. సిబ్బందికి సూచనలిస్తూ గృహ అవసరాలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యమని తెలిపారు. రైతులు విద్యుత్ సమస్యలు సిబ్బందికి ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని, తాము ఎలాంటి చర్యలు చేపట్టరాదని తెలిపారు. అనంతరం సబ్సిడీపై ఇస్తున్న సోలార్ విద్యుత్తు గురించి అవగామన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డివిజన్ అధికారి దేవ ఆశీర్వాదం, ఏడి శంకరయ్య, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పార్క్ మరమ్మతులు చేయించండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, బాబు జగజీవన్‌రావు పార్క్‌లో అవసరమైన మరమ్మత్తులు, సదుపాయాల మెరుగుదల కోసం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మౌర్యకు వినతి పత్రం సమర్పించామని కస్తూర్బా గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయలు తెలియజేశారు. శనివారం బాబు జగజ్జీవన్ రావు పార్క్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యలు సందర్శించారు. పార్కులో పాడైన బెంచీలు, లైటింగ్ సదుపాయాలు, నడక మార్గాల పునరుద్ధరణ, నీటి సదుపాయం వంటి అంశాలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రఘు, మెంబర్స్ రెడ్డప్ప మురళీకృష్ణ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం ఆస్తులను రక్షించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాంజీ మఠం ఆస్తులను పరిరక్షించి అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్య తీసుకోవాలని, ఇందుకోసం బంజారాల ట్రస్ట్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీ స్వామి హథీరాం బాలాజీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు సీతారాం నాయక్, గౌరవాధ్యక్షులు డిటి నాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి గాంధీరోడ్ మఠం భవనం కూల్చివేయకుండా ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా పరీక్షించి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఈ మేరకు వినతి పత్రం ఇవ్వగా వారు మఠం పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో గిరిజన భవన్ చైర్మన్ వెంకటరమణ నాయక్, పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ నాయక్, బాబురావు చౌహన్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి.ఎస్.పి పి.మల్లిఖార్జున రావు, విజిలెన్స్ ఏ.వో రామాంజయ రెడ్డి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ మందులు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, నాణ్యమైన మందులను రైతులకు విక్రయించాలన్నారు. ఈ తనిఖీలలో భాగంగా గూడూరు నిమ్మకాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఎస్ఎస్ అగ్రోమార్ట్ శ్రీ సాయి బాలాజీ రైతు డిపో దుకాణాలలో యూరియా నిల్వలలో వ్యత్యాసాలను గుర్తించి కేసు నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గూడూరు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారి 1500 విగ్రహాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ సారి చవితి ఉత్సవాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా 1500 వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు వినాయక చారిటబుల్ ట్రస్ట్ అధినేత సురేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా నియోజకవర్గ ప్రజలకు వినాయక విగ్రహాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

క్రైం న్యూస్

మినీ వ్యాను దగ్ధం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:వెల్డింగ్ పనులు చేస్తుండగా మినీ వ్యానుకు మంటలు వ్యాపించి దగ్ధమైన ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని చెన్నై రోడ్డులో చోటు చేసుకుంది. షాపుకు మరమ్మతుల నిమిత్తం వచ్చిన ఓ వాహనానికి వెల్డింగ్ పనులు చేస్తుండగా మరో వాహనానికి నిప్పంటుకుని మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. అప్రమత్తమైన వాహనదారుడు, స్థానికులు మంటలు అదుపులోకి తెచ్చే ప్రయత్నించినా సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

గ్యాంగ్ మ్యాన్ మృతి



బందిలి గురవయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -దొరవారిసత్రం :రైల్వే గ్యాంగ్ మ్యాన్ మృతి చెందిన, ఘటన మండల కేంద్రంలోని, రైల్వే గేటు వద్ద చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు, ఏకొల్లు గ్రామానికిచెందిన, బందిలి గురవయ్య (35) రైల్వే గ్యాంగ్ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రైలు పట్టాలపై మృతి చెంది పడిఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకొన్నా రైల్వే పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించి, మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు వివాహితుడు, భార్య, ఇద్దరు కుమారులు, ఉన్నారు. పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి - నాయుడుపేట: ట్రాక్టర్ ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట మండలం, అయ్యప్ప రెడ్డి పాలెం వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నాయుడుపేట మండలం, అన్నమేడు గ్రామానికి చెందిన బచ్చు ప్రవీణ్ మోటార్ సైకిల్ పై చెన్నై హైవేపై వెళ్తుండగా కళ్లిపెడు, అయ్యప్ప రెడ్డి పాలెం మార్గమధ్యంలో ట్రాక్టర్ ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతుడి తల్లి పెంచలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాయుడుపేట అర్బన్ సిఐ బాబి తెలియజేశారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్



ప్రజాశక్తి -దొరవారిసత్రం :అటవీప్రాంతలో, పేకాట ఆడుతున్న 5గురు పేకాట రాయుళ్లను పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లా ఎస్పీ, నాయుడుపేట డీఎస్పీ, సిఐ, ఆదేశాల మేరకు సూరపు అగ్రహారం అటవీ ప్రాంతంలో, పేకాట ఆడుతున్నా 5గురు వ్యక్తులను, డ్రోన్ కెమెరా సహాయంతో పట్టుకొని, వారి వద్దనుడి 4,130 రూపాయలు నగదును స్వాధీనపారు చుకొన్నట్లు తెలిపారు. ఎస్సై.అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా కేసులో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో గంజాయి రవాణా ప్రయత్నాన్ని శనివారం పోలీసులు అడ్డుకున్నారు. సబ్‌ఇన్స్పెక్టర్ టి. ఓబయ్యకు లభించిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్ఓలు), పోలీసులు కలిసి, పుత్తూరు పట్టణం (ఫ్లై ఓవర్ బ్రిడ్జి) తిరుపతి రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీప బస్టాప్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నగరి మండలం, ఓజీ కుప్పం గ్రామం, జగనన్న కాలనీకి చెందిన పి.లింగేశ్వరి (47)ను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో, ఆమె ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుండి 11 కిలోల గంజాయిని కిలోకు రూ.6,000 చొప్పున కొనుగోలు చేసి, రైలులో రేణిగుంటకు చేరుకుని, అక్కడి నుండి పుత్తూరుకు వచ్చిందని తెలిపింది. నగరికి వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఆమెను పట్టుకున్నారు. ముద్దాయి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.66,000 ఉంటుందని తెలిపారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి, కడప డివిజన్, సీకే దిన్నె మండలం పరిధిలోని అటవీ ప్రాంతంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్ రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నే మండలంలోని మద్దిమడుగు ఫారెస్ట్ సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారని తెలిపారు. కొలుములపల్లి సమీపంలో కొంతమంది వ్యక్తులు ఒక కారుతో కనిపించారని, వారిని చుట్టు ముట్టే ప్రయత్నం చేయగా పారిపోవడానికి ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడిస్తూ టాస్క్ ఫోర్స్ సిబ్బంది ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారన్నారు. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారిగా గుర్తించామన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ డిఎస్పీ వి.శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్ వారిని విచారించగా ఆ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం బాడుగకు తీసుకుని వచ్చి అందులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించినట్లు తెలిసిందన్నారు. ఈ కేసును ఎస్ఐ రఫీ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్లు బాడుగకు ఇచ్చేముందు వారి పూర్తి వివరాలు తెలుసుకుని ఇవ్వాలని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. ఆ కార్లను ఎర్రచందనం అక్రమ రవాణాకు ఉపయోగించే పక్షంలో కారు యజమాని కూడా భాధ్యుడు అవుతారని, వారిపై కూడా కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు.

ఆగ్నేయ గణపతి గతి ఇంతేనా..!!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:నవసంధి వినాయకులలో ఒకరైన ఆగ్నేయ వినాయకుడి ఆలయాన్ని పునర్ నిర్మించడంలో ఆలయాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. రెండు నెలల క్రితం జీర్ణోదారణ పేరుతో ఆలయాన్ని పడగొట్టి చివరకు మురికి కూపం చేశారని మండిపడ్డారు. శనివారం పట్టణంలోని ఆగ్నేయ వినాయకుడి ఆలయ పునర్నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈనెల 27వ తేదీన దేశవ్యాప్తంగా చవితి ఉత్సవాలు జరుగుతుండగా, ఆగ్నేయ వినాయకుడి గుడిలో దీపం కూడా వెలగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాన్ని మీరు నిర్మిస్తారో..! లేకుంటే మమ్మల్ని నిర్మించమంటారో చెప్పాలని సవాల్ విశారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ మెకానిక్‌లకు కమ్యూనిటీ భవనం

ప్రజాశక్తి -రేణిగుంట : ఎన్నికల ప్రచారంలో తమకు ఒక కమ్యూనిటీ భవనం కోసం చిన్న స్థలం కావాలని ఆనాడు రేణిగుంట మండలంలోని స్కూటర్ మెకానిక్‌లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కోరారు. దీంతో శనివారం రేణిగుంట మండలంలోని స్కూటర్ మెకానికులు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాతో కలిసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి సన్మానించి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన తాను ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట కట్టుబడి ఉన్నానని, వెంటనే వీరికి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, దీంతోపాటు అర్హులైన అందరి మెకానిక్‌లకు ఇళ్లస్థలాలు కూడా కేటాయించాలని తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. వారం రోజుల్లో స్థలం కేటాయిస్తామని తహశీల్దారు తెలిపారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: చిన్నపాండూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అపోలో టైర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్ప్ ఫౌండేషన్ ద్వారా స్టీల్ వాటర్ ప్లాస్కులు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యాం మాట్లాడుతూ స్కూల్ పిల్లకి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌లో నీరు త్రాగడం చాలా ప్రమాదకరమని భావించి స్టీల్ వాటర్ ప్లాస్క్స్ అందిచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల సుబ్రహ్మణ్యాం, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మకు ఘనంగా పూజలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట :సూళ్లూరుపేట మండల పరిధి, కోటపోలూరు, శ్రీ నారాయణి పేరంటాలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ ఉత్సవాలను కొండమరెడ్డి రవితేజ, కావ్య దంపతులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండమ రెడ్డి అనిల్ కుమార్ రెడ్డి, సరిత దంపతులు, ఆరని విజయభాస్కర్ రెడ్డి, సుజాత దంపతులు, కొండమరెడ్డి మల్లికార్జున రెడ్డి, సుభాషిని దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లా విభాగం ఆధ్వర్యంలో "పర్యావరణ పరిరక్షణపై లీగల్ సపోర్ట్ సెల్ అవగాహన కార్యక్రమం తుమ్మలగుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ సంస్థ శివాజీ మాట్లాడుతూ మానవజాతి ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ఒకటి పర్యావరణ కాలుష్యం అని తెలిపారు. స్థానిక ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆదర్శ రైతు బాపన్న మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణ, చెట్లను పెంచవలసిన ప్రాధాన్యత, గాలి కాలుష్యం నియంత్రణపై వివరించారు. ఈ సదస్సులో మహిళా విశ్వవిద్యాలయ ఎగ్జామ్స్ డీన్, పి.యం.ఉష మెంబర్ ప్రొఫెసర్ కె.అనురాధ, ప్రొఫెసర్ టి.సీతా కుమారి, సునీత కాణిపాకం, ఇందిరా ప్రియదర్శిని, తుమ్మలగుంట స్కూల్ హెడ్ మాస్టర్ భారతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఎంసి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

ప్రజాశక్తి -కోట : కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 25వ తేదీన జరుగనున్న ప్రమాణం స్వీకార మహోత్సవానికి ఊనుగుంట పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు నల్లప రెడ్డి జగన్మోహన్ రెడ్డిని, తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, ఏఎంసి చైర్మన్ ప్రమీల, ఎమ్ పిటిసి దారా సురేష్‌లు ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను అందజేసే వారిలో తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు శంషుద్దీన్, మండలం ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కోటేశ్వరరావు, నాయబ్ భాషా తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) మండలంలోని బోనుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుఖబ్రహ్మాశ్రమ అనుబంధ భక్త కన్నప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. విద్యార్థులతో పాటు, గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, మాజీ సర్పంచి దావులూరు రామానాయుడు, ట్రస్టు కో-ఆర్డినేటర్ దొర కుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయచంద్రప్ప, ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు మండలం పరిధిలోని ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు చవటపాలెం ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం కిషోరి బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.సి.డి.ఎస్., సి.డి.పి.ఓ. మహబూబి మాట్లాడుతూ కొంత మంది తల్లి దండ్రులు మైనర్ బాలికలకు వివాహాలు చేస్తున్నారని, బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్.సూపర్వైజర్ స్వరూపరాణి, హైస్కూల్ హెడ్ మాస్టర్ కుమార్, టీచర్ భారతి, అంగన్వాడీ టీచర్స్ ఎం.యశోద, టి.దేవసేనమ్మ, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్థానిక ఆర్‌సి. రోడ్ లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు, ఇతర డాక్టర్స్ మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తాము ఉంటున్న ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలు వంటివి వాడటం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా అరికట్టవచ్చునని చెప్పారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఎకో క్లబ్ సమన్వయకర్త లక్ష్మయ్యల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కానుగ చెట్లు నాటారు.

బుచ్చినాయుడు కండ్రిగ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, మండల అధికారులు స్వచ్ఛాంధ్రపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆమె వారపు సంతలో, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద పురపాలక సంఘ ఆధ్వర్యంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది ప్రజలకు వర్షాకాల పరిశుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:స్వచ్ఛ శ్రీకాళహస్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పై ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో 3వ శనివారం అమండూరు పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సౌభాగ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ నివాస పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలవ లేకుండా చూడాలని డాక్టర్ మన్యం నరసింహులు సూచించారు. శనివారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు కాలేజీ పరిసరాలను శుభ్రం చేశారు.



శాస్త్రీయ దృక్పథంతోనే జీవన ప్రమాణాల వృద్ధి



ప్రజాశక్తి - క్యాంపస్ : భారత జాతీయ అంతరీక్ష మరియు ఇస్రో దినోత్సవాన్ని శనివారం తిరుపతి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఈ సంవత్సర ఇతివృత్తం "ఆర్యభట్టా నుండి గగన్ యాన్ వరకు: ప్రాచీన విజ్ఞానంతో అనంతమైన అవకాశాలు మరియు సుస్థిర భవితకు అంతరీక్ష ఆవిష్కరణలు" అనే అంశం భారతదేశం పూర్వం నుంచి అంతరీక్ష ప్రయోగ శాస్త్రంలో ఎన్నో మహత్కార్యక్రమాలను చేసి ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ కీర్తించే స్థాయిలో ఎలా అభివృద్ధి పథంలో కొనసాగుతోందో మనకు తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ చైర్మన్, అడ్వకేట్, పురుషోత్తం రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి, ఎస్. రెడ్డెప్ప, ప్రభాకర్, రవీంద్ర, పౌర శాస్త్ర అధ్యాపకుడు, డా. సి. ఎల్. చెన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాని తహశీల్దారు శ్రీదేవి సూచించారు. ఎవరికైనా పథకం అందనివారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకువచ్చి తప్పులను సవరించుకున్నట్లయితే అన్నదాత సుఖీభవ అందుతుందని తెలిపారు. ఎవరైనా మృతి చెందిఉన్నట్లయితే వారి కుటుంబ సభ్యుల పేరుమీదకు ముటేషన్ చేయించుకుంటే వారికి పాసు పుస్తకం ఇవ్వనున్నట్లు తెలిపారు.



తహశీల్దారు శ్రీదేవి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండల రైతులు అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దాం సుబ్రమణ్యాం కోరారు. ఆయన మాట్లాడుతూ పథకం అందనివారు వారి పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకువచ్చి తప్పులను సవరించుకున్నట్లయితే అందుతుందని తెలిపారు. ఎవరైనా మృతి చెందిఉంటే ఆధారాలు సమర్పించి అర్హత పొందాలని కోరారు.



తహశీల్దారు సుబ్రమణ్యాం

సుఖ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:స్వచ్ఛంద సేవా సంస్థ గ్రాసం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో వలస కార్మికులకు హెచ్ఐవి, సుఖ వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాసం ప్రాజెక్టు మేనేజర్ మాధవి మాట్లాడుతూ హెచ్ఐవి ఎలా సంక్రమిస్తుంది, అపోహలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎం వరలక్ష్మి, ఎర్రయ్య, గాయత్రి, మౌనిక, వలస కార్మికులు పాల్గొన్నారు.

డిడిఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -వాకాడు: కలెక్టర్ పర్యటన అనంతరం హరిజనవాడలో అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజుల నుంచి డ్రైనేజీ వ్యవస్థపై ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి చర్యలకు పూనుకున్నారు. శనివారం శానిటేషన్ పనులు జరుగుతుండగా డిడిఓ వాణి తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యంపై తగు చర్యలు తీసుకోవాలని, రానున్నది వర్షాకాలం కనుక వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, దోమల నివారణకి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈఓ నసీమాలి, ఈవోపిఆర్డి ఉమామహేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి ప్రవళిక, గ్రామ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రేరణతో ప్రతిభకు గుర్తింపు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ:మానవతా విలువలకు ప్రతిబింబంగా నిలిచిన ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 18వ వార్షికోత్సవ వేడుకలు శనివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించారు. "ప్రేరణ సహృదయ" పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో 90 మందికిపైగా ప్రత్యేక ప్రతిభావంతులైన చిన్నారులు తమ కళలతో హృదయాలను తాకారు. నవజీవన్, పాస్ మనో వికాస్, శ్రీ వెంకటేశ్వర డెఫ్ అండ్ డంబ్ స్కూల్, రాస్, అక్షయ క్షేత్రం సంస్థల నుండి వచ్చిన చిన్నారుల ప్రతిభకు ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి శ్రీలత మాట్లాడుతూ, ఈ తరహా కార్యక్రమాలు యువత ఆశయాలకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యవాణి, హేమ ప్రియ, ఆకాష్, జయ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

మరింత స్మార్ట్ గా రైస్ కార్డ్

ప్రజాశక్తి -ఏర్పేడు : పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పిడిఎస్ రైస్ రేషన్ డీలర్ల నుంచి పక్కదారి పడకుండా, క్యూఆర్ కోడ్ సహాయంతో జిల్లాస్థాయి అధికారులు ఆన్లైన్ విధానంలో పర్యవేక్షణకు వెసలుబాటుగా ఉండేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రైస్ కార్డులను మొదటి దశలో భాగంగా తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలంలో సోమవారం నుండి అధికారులుచే ఇంటింటికి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నామని ఏర్పేడు తాసిల్దార్ ఎం భార్గవి తెలిపారు. ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండి ఈ స్మార్ట్ రైస్ కార్డులను పొందాలని కోరారు.

శాంతియుతంగా చవితి ఉత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి కమిటీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పి నర్సింహమూర్తి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. చవితి నియమాలను, నిబంధనలను వివరించారు. డీజే సౌండ్స్, రికార్డింగ్ డాన్స్, బలవంతపు వసూళ్లు చేయరాదన్నారు. ముందస్తు అనుమతి లేకుండా విగ్రహాలను ఉంచడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సీఐ గోపి, టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండలంలోని కాంపాలెం పంచాయతీకి చెందిన శుద్ధమెట్ట ఎస్టీ కాలనీలో శనివారం ఉదయం విద్యాశాఖ అధికారిముని సుబ్రహ్మణ్యాం, పాఠశాల ఉపాధ్యాయులు సతీష్ కుమార్‌లు కలిసి చిన్న పాలివేడులో పర్యటించి బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలు పాఠశాలకు రాను, పోను ఆటో సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలుపగా, తల్లిదండ్రులు సుముఖత తెలిపారు.